విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 05,జనవరి 2024

పంపింగ్ యార్డ్లో ఉండాల్సిన చెత్త మున్సిపల్ కార్యాలయంలో

సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కనిపించని ప్రభుత్వ తీరు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 2వ రోజు సమ్మె

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 26 వేలు జీతాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షులు జి.చిరంజీవి ఆధ్వర్యంలో 2వ రోజు అర్ధ నగ్నంగా మోకాళ్లపై వినూత్న నిరసన చేపట్టారు. మున్సిపల్ అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో చెత్త ఎత్తివేస్తుంటే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో అడ్డుకొని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరవాలని పారదోలడం జరిగింది. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సి.జాఫర్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మల్లికార్జున, ఏఐటియుసి నగర కార్యదర్శి వికె కృష్ణుడు,ఆశ వర్కర్ల జిల్లా కార్యదర్శి నాగవేణిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సి జాఫర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అనేక రోజుల నుండి ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం పట్టించుకోకవడంతో తప్పని సమయంలో మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మెలకు దిగడం జరిగింది. సిపిఐ ఎప్పుడు కూడా వారి పక్షాన పోరాడి న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంతవరకు వారి వెన్నంట ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు.తాడేపల్లి లో కూర్చున్న సీఎం జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికుల సమస్యల పైన నోరు విప్పాలి. వారి న్యాయమైన డిమాండ్ లను తక్షణమే పరిష్కరించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ప్రతిపక్షంలో పాదయాత్ర సమయంలో ఔట్సోర్సింగ్ కార్మికులను అధికారంలోకి వచ్చిన వెంటనే పర్మినెంట్ చేస్తారని ఆనాడు హామీ ఇచ్చావు. ఆ హామీనే నెరవేర్చండి అని అడుగుతా ఉన్నాం. కార్మికులేమీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. పనిచేస్తూ 26,000 జీతాలు పెంచమని అడుగుతున్నారు. హెల్త్ అలవెన్స్ ఫిజికల్ వెన్స్ ఇవ్వాలి. అవసరమైనప్పుడు మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచాలి. దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో తక్షణమే వారి సమస్యలు పరిష్కరించి రాష్ట్రంలో కరోనా కేసులు పెరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, సహాయ కార్యదర్శి నాగరాజు, నాయకులు నాగేంద్రబాబు, శివకృష్ణ తిరుమలయ్య, ఎర్రప్ప రామాంజనేయులు, శంకర, ప్రసాద్, హసేన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూ రక్ష పాస్ బుక్ ప్రతులు దగ్ధం

విశాలాంధ్ర-శింగనమల: జగనన్న భూ రక్ష పథకం కింద పట్టాదారు పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బొమ్మతో ముద్రించి రైతులకు తప్పులతడకగా అందజేస్తున్నారని, జిల్లా సమితి సభ్యులు తరిమెల రామాంజనేయులు ఆధ్వర్యంలో కొరివిపల్లి సచివాలయం ముందు పాస్బుక్ ప్రజలను దగ్ధం చేశారు, రైతులకు అందజేసిన ఈ-పాస్ పుస్తకాలు నిరుపయోగంగా మారాయని రైతులు ఆందోళన వ్యక్తం పరుస్తున్నారన్నారు. ఈ విధంగా ముఖ్యమంత్రి ఫోటోలతో ముద్రించిన పాసు పుస్తకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి రంగయ్య, నాగరాజు, రాజారాం, శ్రీరాములు, ఆదినారాయణ, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రాయదుర్గం అర్బన్ : పట్టణంలోని 11వ సచివాలయ కార్యాలయం వద్ద సిపిఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం సిపిఐ తాలుకా కార్యదర్శి ఎం. నాగార్జున భూ రక్ష పాస్బుక్ ప్రతులను దగ్దం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, పట్టణ కార్యదర్శి కో(టేష్, రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-తాడిపత్రి: మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామ సచివాలయం, పట్టణంలోని 10, 11వ సచివాలయాల వద్ద గురువారము జగనన్న భూ రక్ష పాస్ బుక్ రద్దు చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్య దర్శి టి. రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సచివాలయం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నాగ రంగయ్య ఏఐటీయూసీ నాయకుడు ఉమా గౌడ్ వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా అధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన సందర్భంగా పటిష్ట చర్యలు చేపట్టండి

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ...

విశాలాంధ్ర - అనంతపురం వైద్యం: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటన నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు.ఈనెల 6వ తేదీన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పర్యటన నేపథ్యంలో గురువారం ఎస్పీ బుక్కరాయ సముద్రం జడ్పీ ఉన్నత పాఠశాల, అనంతపురం జేఎన్టీయూలోని ఆడిటోరియంలో ఏర్పాట్లను పరిశీలించారు. చేపట్టాల్సిన బందోబస్తు చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, డీఎస్పీలు జి.ప్రసాదరెడ్డి, బి.వి.శివారెడ్డి, బుక్కరాయ సముద్రం సి.ఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సిఐ వెంకటేష్ నాయక్, బుక్కరాయ సముద్రం రెవెన్యూ అధికారులు మరియు జెఎన్టీయు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సనప నీళ్ళ పాల రామకృష్ణ

విశాలాంధ్ర-ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలో భగత్ సింగ్ కాలనీ కేంద్రంలోని సిపిఐ ఆఫీస్ కార్యాలయంలో గురువారం ఆత్మకూరు మండలం ఏపీ రైతు సంఘం జిల్లాసహాయ కార్యదర్శి సనప నీళ్ల పాలరామకృష్ణ ఆధ్వర్యంలో 18వ రాష్ట్ర మహాసభలో జయప్రదం చేయాలని పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ రైతు సంఘం 18వ రాష్ట్ర మహాస భలు రాజమండ్రి నగరంలో ఈనెల 8, 9,10 వ తారీకులలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయి అని పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా రైతులు, రైతు శ్రేయోభిలాషులుఏపి రైతు సంఘం నాయకులు, అందరు కూడా పెద్ద ఎత్తున హాజరుకావాలని ఏపీ రైతు సంఘం అనంతపురం జిల్లా రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైక్య సరస్వతి, సుధమ్మ ,వడ్డే రామాంజనమ్మ, రబియా, వడ్డే లక్ష్మీదేవి, రైతులు సర్దాని, కొండన్న, లక్ష్మీనారాయణ,, చిన్న ఉల్లిగన్న,, రైతుసోదరు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత మెటీరియల్స్ అందజేత

విశాలాంధ్ర - శెట్టూరు : మండల పరిధిలో లక్ష్మంపల్లి గ్రామంలో పదవ తరగతి విద్యార్థులకు దాత వన్నూర్ స్వామి సాయంతో ఉచిత మెటీరియల్స్ అందజేశారు. దాదాపుగా 40 మంది విద్యార్థులకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలకు మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు.ఇచ్చినటువంటి మెటీరియల్స్ అందరూ కూడా సద్వినియోగంగా వినియోగించుకుని అందులో ఉన్నటువంటి ప్రశ్న సమాధా నాలను చదువుతూ వాటితో పాటు ఉపాధ్యాయులు చెప్పేటువంటి ప్రశ్నలు, సమాధానాలను చదువుకుని ఈ సారి మంచి ఫలితాలు సాధించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్ ,కల్యాణి రామచంద్ర, చంద్రకళ ఓబులపతి, వీరభద్ర, నగేష్, ఆదినారాయణ, సునీత,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సత్తార్ కుటుంబాన్ని పరామర్శించిన లారీ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.నారాయణస్వామి

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ : కొత్తూరు లారీ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) నగరంలోని స్థానిక రాణి నగర్ కు చెందిన సీనియర్ నాయకులు లారీ డ్రైవర్ సత్తార్ మంగళవారం అనారోగ్య కారణంగా మరణించారు. విషయం తెలుసుకున్న లారీ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి నారాయణస్వామి వారి భౌతికయానికి పూలమాలలు వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భవిష్యత్తులో మీకుటుంబానికి లారీ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అండగా ఉంటుందన్నారు. ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి వికె కృష్ణుడు, లారీ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, మురళి,శ్రీనివాస్,సైఫుల్లా, చలపతి లు పాల్గొన్నారు.

పిల్లలకు ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర- అనంతపురం వైద్యం: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి త్వరిత చికిత్స కేంద్రము నందు రాష్ట్రీయ బాల స్వస్థ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా గురు వారం జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో పుష్ప గిరి కంటి ఆసుత్రి కడప వారి సహకారంతో బరువు తక్కువగా పుట్టిన, నెలలు నిండక పుట్టిన పిల్లలు,గుండె లోపం, రక్తహీనత ఇతర వ్యాధులతో బాధపడుతున్న పిల్లలను సమీకరించి వారికి కంటి రెటీనా పరీక్షలను 'రెడ్ కామ్' అనే పరికరంతో స్క్రీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 మంది పిల్లలను పరీక్షించగా,అందులో 12 మంది పిల్లలకు సమస్య ఉన్నట్టు గుర్తించారు. వీరిని మరల రెండు వారాల తర్వాత పరీక్షించి రెటీనా మెచ్యూరిటీ పొందకపోతే వీరికి ఉచితంగా చికిత్స చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డా.శ్రీవిద్య, కంటి పరీక్షా నిపుణురాలు జ్ఞానప్రసన్న,మేనేజర్ రజిత,స్టాఫ్ నర్స్ మౌనిక,దివ్య, పాల్గొన్నారు.

నేడు నూతన పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-రాయదుర్గం రూరల్: వైఎస్ఆర్ పెన్షన్ కానుక పథకంలో భాగంగా రూ. 2750 ల నుండి 3000 రూపాయల వరకు ఈ నెల నుంచి పెంచిన నూతన పెన్షన్లను నేడు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి తెలిపారు. పింఛన్ వారోత్సవాల్లో భాగంగా నేడు సాయంకాలం 4 గంటలకు బళ్ళారి రోడ్డు వైఎస్ఆర్ విగ్రహం వద్ద నూతన లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పోరాళ్ళు శిల్ప కౌన్సిలర్లు తదితరులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు పకడ్బందీగా జరగాలి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు పకడ్బందీగా జరగాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం పౌర హక్కుల పరిరక్షణ అత్యాచార నిరోధక చట్టం (పిసిఆర్ , పిఓఏ యాక్ట్) పై నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్,మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను సభ్యులు పరిశీలించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎస్టీ తండాలు ఉన్నాయని, వాటి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక రకాల సంక్షేమ పథకాలను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు వర్తింప చేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంకా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఉండడం తగదని, ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలో 76 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉండగా, 537 కేసులు పెండింగ్ ట్రైన్ లో ఉన్నాయన్నారు. సారించాలన్నారు. ఈనెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విజయవాడలోని స్వరాజ్ మైదాన్లో 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని, ఇందుకు సంబంధించి ఈనెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జిల్లాలో జన్ భాగిదరి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మాట్లాడుతూ పౌర హక్కుల పరిరక్షణ అత్యాచార నిరోధక చట్టంను పోలీస్, రెవెన్యూ కలిసి అమలు చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో కొన్ని సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయని, వాటిని తమ దృష్టికి తీసుకువస్తే ఆయా గ్రామాల వద్ద పోలీస్ అవుట్ పోస్టులను ప్రారంభిస్తామన్నారు.ఎస్సీ,ఎస్టీలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే అక్కడ రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఓ గాయత్రీ దేవి, ఆర్డీవోలు గ్రంధి వెంకటేష్, రాణి సుస్మిత, సి.శ్రీనివాసులురెడ్డి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి,డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిఈఓ నాగరాజు, డీపీఓ ప్రభాకర్ రావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, డిఎస్పిలు, విజిలెన్స్,మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

6న జేఎన్టీయూ కాన్వొకేషన్

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ రాక

విశాలాంధ్ర - జెఎన్టీయుఏ : జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం 16 వ కాన్వొకేషన్ కు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ రానున్నట్లు ఉపకులపతి ఆచార్య జింక రంగా జనార్దన్, రెక్టర్ ఆచార్య విజయ్ కుమార్,రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ పేర్కొన్నారు. మాజీ ఉపకు పతి విశ్వేశ్వరాయ టెక్నాలజికల్ యూనివర్సిటీ బెళగావి,పూర్వ విద్యార్థి, గౌరవ డాక్టరేట్ ను ఆచార్య కే.బాలవీరా రెడ్డి గౌరవ డాక్టరేట్ను గవర్నర్ ప్రధా నం చేయనున్నట్లు తెలిపారు. 2021-22 లో 37,2022-23 లో 34 మొత్తం 71 గోల్డ్ మెడల్స్ను ఇవ్వనున్నట్లు తెలిపా రు. 16వ కాన్వొకేషన్ లో ఇన్ కాన్వొకేషన్ 10142, పోస్ట్ కాన్వొకేషన్ 62272,ప్రీ కాన్వొకేషన్ 13728 మొత్తం 86,142 మంది విద్యార్థులకు పట్టాలు ఇవ్వనున్నట్లు అన్నారు. కాన్వొకేషన్ కన్నుల పండుగగా నిర్వహించేందుకు వివిధ కమిటీల వారిగా బాధ్యతలను కేటాయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఓటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, పి.ఆర్ ఓ రామ శేఖర్ రెడ్డి, అంకారావు పాల్గొన్నారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు జేఎన్టీయూ అనంతపురం బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ దాసరి శాంతి 8 గోల్డ్ మెడల్స్ ను , సి.బి సాయికుమార్ . మెకానికల్ ఇంజనీరింగ్ ఐదు గోల్డ్ మెడల్స్, సివిల్ ఇంజనీరింగ్ బి.మేఘన 4 మెడల్స్ ను అందుకోనున్నారు.

టీడీపీ గెలవడం ఖాయం

- దొంగ ఓట్లతో గెలవాలన్న ఉద్దేశం వైసీపీది..

-మాజీ మంత్రి పరిటాల సునీత

విశాలాంధ్ర-రాప్తాడు: మరో మూడు నెలల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, వైసీపీకి ఏ చిన్న అవకాశం ఇవ్వద్దని పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి పరిటాల సునీత సూచించారు. అనంతపురంలోని నివాసంలో గురువారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలం నాయకులతో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ రిజిస్ట్రేషన్స్, ఓటర్ వెరిఫికేషన్ వంటి అంశాలపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతి ఒక్కరు సీరియస్ గా పని చేయాలన్నారు. ఇప్పటికే వైసీపీపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని టీడీపీ గెలుపు ఖాయమన్నది అందరికీ తెలుసన్నారు.ఇలా అనుకొని నిర్లక్ష్యంగా ఉండవద్దని..ఏ చిన్న అవకాశం కూడా వైసీపీకి ఇవ్వకూడదన్నారు. ఇలా జరగాలంటే ఓటర్ వెరిఫికేషన్ మీద ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.దొంగ ఓట్లతో గెలవాలన్న ఉద్దేశంతో వైసిపి ఉందని, ఒక్క ఓటు విషయంలో కూడా పొరపాటు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు.మరోవైపు బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ రిజిస్ట్రేషన్స్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. మేనిఫెస్టోలోని పథకాలు మనకు ఒక ఆయుధం లాంటివని దీనిని మనకు కచ్చితంగా ఉపయోగించుకోవాలన్నారు. క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, బిఎల్ఎలు, బూత్ కన్వీనర్లు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు అండగా టీడీపీ

విశాలాంధ్ర-పామిడి: అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు గురువారం 24 రోజు నిరవధిక సమ్మెను పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో కొనసాగించారు.ఈ సమ్మెకు తెదేపా సీనియర్ నాయకులు పెరుమాళ్ళ జీవానంద రెడ్డి మద్దతు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటీ ఇవ్వాలని,గత ఆరు నెలల నుండి పెండింగ్లో పెట్టిన సెంటర్ అద్దెలు,టిఏ, డిఏ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు.యఫ్.ఆర్.ఎస్ యాప్ రద్దు చేయాలన్నారు. అన్ని కేంద్రాల్లోనూ కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీ కార్యకర్తలకు వర్తింప చేయాలన్నారు.సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.బీమా అమలు చేయాలన్నారు.వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం వర్తింపచేయాలన్నారు,ప్రభుత్వం అన్ని విధాల అంగన్వాడి వర్కర్స్ ను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, మారుతి ప్రసాద్ రెడ్డి,బాబా ఫక్రుద్దీన్,అంగన్వాడీ కార్య కర్తలు జయంతి, మహాలక్ష్మి,నారాయణమ్మ, మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ వర్కర్స్. హెల్పర్స్ పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు

విశాలాంధ్ర -అనంతపురం వైద్యం, జెఎన్టీయుఏ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడోత్సవాలును అనంతపురం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ను ఎంపీ తలారి రంగయ్య, సాంకేతిక విద్యాశాఖ కమీషనర్ సి.నాగరాణి, జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, అట్టహాసంగా ప్రారంభించారు. క్రీడోత్సవాలను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్ర రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పాలిటెక్నిక్ గేమ్స్ జెండాను ఆవిష్కరించి క్రీడాకారులతో ప్రమాణము చేయించారు. పాలిటెక్నిక్ గేమ్స్ కు సంబంధించిన క్రీడా జ్యోతిని సాంకేతిక విద్యాశాఖ కమీషనర్ వెలిగించారు.చివరిగా అతిథులు పావురాలను గాలిలోకి వదిలి పాలిటెక్నిక్ క్రీడలు ప్రారంభమైనట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా సాంకేతిక విద్యాశాఖ కమీషనర్ సి.నాగరాణి, జిల్లా కలెక్టర్ లు వాలీబాల్, టేబుల్ టెన్నిస్ క్రీడలను ప్రారంభించారు. సాంకేతిక విద్యాశాఖ కమీషనర్ సి.నాగరాణి, జిల్లా కలెక్టర్ లు వాలీబాల్, టేబుల్ టెన్నిస్ క్రీడలను కొద్దిసేపు ఆడి క్రీడాకారులతో ముచ్చటించి వారిని ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా సాంకేతిక విద్యాశాఖ కమీషనర్ మాట్లాడుతూ సాంకేతిక విద్యతోపాటు క్రీడలు కూడా విద్యార్థులకు అత్యవసరమని క్రీడల ప్రగతికి తోడ్పడుతామన్నారు. రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడోత్సవాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రభుత్వ పాలిటెక్నిక్ అనంతపురంలో జరగడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి మాట్లాడుతూ అనంతపురం రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడోత్సవాలు నిర్వహించడం పట్ల సంతోషంగా ఉందన్నారు. క్రీడోత్సవాల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మాట్లాడుతూ మానసిక సమస్యలు అధిగమించటానికి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో 26 జిల్లాలు నుండి 13 ప్రాంతీయ పోటీల నుండి అర్హత సాధించిన 1,400 క్రీడాకారులు 13 క్రీడాంశాలు మరియు 6 ఆటలు పోటీలలో పాల్గొంటున్నారు. వందమంది వ్యాయామ సిబ్బంది హాజరయ్యారు. ఈ పోటీలు 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరగనున్నాయి.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఆర్.ఆశా జ్యోతి, సర్పంచ్ జి.ఉదయ్ శంకర్, తిరుపతి సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ ఎ. నిర్మల్ కుమార్ ప్రియ, కాకినాడ సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణ, సాంకేతిక విద్యాశాఖ సెక్రటరీ కె.వి రమణ బాబు, సాంకేతిక విద్యా శాఖ, మంగళగిరి నుంచి పలువురు అధికారులు, పాలిటెక్నిక్ కళాశాల అధికారులు, సిబ్బంది, పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

విశాలాంధ్ర - బొమ్మనహల్ : బొమ్మనహాళ్ మండలం గోవిందవాడ క్రాస్ వద్ద గురువారం బొమ్మనహల్ పోలీసులు కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నారు. బొమ్మనహాళ్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన బోయ తిప్పేస్వామి కర్ణాటక మద్యం ను తరలిస్తున్నట్లు సమాచారం తో గోవిందవాడ క్రాస్ లో తనిఖీ చేయగా 28 8 టేట్రా ప్యాకెట్లు మద్యం తో పాటు మోటార్ సైకిల్ ను స్వాధీనం స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లుగా ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. గ్రామాల్లో ఎవరైనా కర్ణాటక మద్యం అమ్మితే 9346010584 నెంబర్ కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగరాజు యాదవ్, రాజ్, కుల్లాయప్ప, ధరమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు సీపీఐ మద్దతు

విశాలాంధ్ర - కూడేరు : ఉరవకొండ నియోజకవర్గంలోని కూడే రు మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం దగ్గర అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేస్తున్నటువంటి నిరసన 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగాఉరవకొండ తాలూకా కార్యదర్శి కామ్రేడ్ జే మల్లికార్జున మాట్లాడుతూ 24 రోజులుగా అంగన్వాడీల సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా లేదన్నారు.తమ న్యాయమైన కోరికలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలోరైతు సంఘం సీనియర్ నాయకులు ముట్టాల శ్రీరాములు, రైతు సంఘం మండల కార్యదర్శి టి.రమణ,కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఎం. వెంకటేష్, మాజీ కోఆప్షన్ నెంబరు కాసిం పీరా పాల్గొని సంఘీభావం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ మండల అధ్యక్షురాలు రామాంజనమ్మ, కార్యదర్శి పారిజాత, నాయకులు లక్ష్మీకాంతమ్మ, లక్ష్మీదేవి, నిర్మల అక్కమ్మ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టిలో పడి బాలుడు మృతి

విశాలాంధ్ర - డి.హీరేహాళ్ : మండల పరిధిలోని హీర్దేహాళ్ గ్రామ సమీపాన ఉన్న మహేష్ పైపు ఫ్యాక్టరీ నందు గురువారం లింగమ్మ కుమారుడు కిరణ్కుమార్(2) నీటి తొట్టిలో పడి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసిన నీటితొట్టిలో బాలుడు ఆడుకుంటు వెళ్లి నీటితోట్టిలో పడిపోయాడని తెలిపారు.బాలుడు ఎంతసేపటికి రాకపోవడంతో బాలుడి అవ్వ లక్ష్మి వెతుకుతూ వెళ్లి చూడగా అప్పటికే బాలుడు నీటితొట్టేలో కొట్టుమిటాడుతూ ఉన్న సంఘటనను చూసి అవ్వ వెంటనే బాలున్ని రక్షించాలని ప్రయత్నించి ఆమె కూడా నీటితొట్టేలో పడిపోయిందన్నారు. వెంటనే అక్కడ ఉన్న తోటి కూలీలు గమనించి ఇద్దరిని హీరేహాళ్ వైద్యశాలకు తరలించారు.అక్కడ ప్రతమ చికిత్స అనంతరం బళ్లారి విమ్స్కు ఇద్దరిని డాక్టర్లు రెఫర్ చేయడంతో మార్గమధ్యంలో బాలుడు మృతి చెందగా అవ్వ చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై ఎస్సై రంగడు విచారిస్తున్నట్లు తెలిసింది.

రైతు పట్టాదారు పాసుపుస్తకం పై జగన్ ఫోటో ఎందుకు

విశాలాంధ్ర- పుట్లూరు: మండల పరిధిలోని కందికాపుల సచివాలయం వద్ద సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో భూ రక్ష పాస్ బుక్ పత్రాలను దగ్ధం చేయడం జరిగినది. సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన ఫోటో ముద్రించి భూ రక్ష పథకం కింద పట్టాదారుల పాసు పుస్తకాలను రైతులకు అందజేస్తున్నారని రైతులకు అందజేసిన ఈ-పాస్ పుస్తకాలు నిరువయోగంగా మారాయని రైతులు ఆందోళన వ్యక్తం పరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిరాజు,పెద్దన్న, ఓబులపతి,రైతు వెంకట్ రెడ్డి,పెద్ద కొండయ్య,దేవరాజ్,సూరి,రంగప్ప,వెంకటరమణ,నారాయణ,ధన ,పాల్గొన్నారు.

చెత్తను తీసివేస్తున్న వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - తాడిపత్రి : పట్టణంలోని రామచంద్ర లాడ్జ్, రెండో వార్డులో వైసిపి ఇన్చార్జ్ షావలి ఆధ్వర్యంలో చెత్తను తీసివేసే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షావలి మాట్లాడుతూ దాదాపు పది రోజుల నుండి మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుండడంతో కాలనీలలో చెత్త ఎక్కువ అవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవ చూపి ప్రజల చెత్త కష్టాలను తీర్చడానికి ఇంటింటికి వెళ్లి తాము తమ కార్యకర్తలతో చెత్తను తీసివేసే కార్యక్రమం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు షబ్బీర్, రియాజ్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి

www.visalaandhra.com

కర్నూలు, శుక్రవారం 05,జనవరి 2024

పరిటాల శ్రీరామ్ పాదయాత్రకు తొలి రోజే అనూహ్యస్పందన

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ చేపట్టిన పాదయాత్రకు తొలిరోజే మంచి స్పందన కనిపించింది.ఈ సందర్భంగా వారు ఎనిమిదవ వార్డులో ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజల ఇబ్బందులను పాదయాత్రలో స్పష్టంగ పరిటాల శ్రీరామ్ చూశారు.అనంతరం వారు మాట్లాడుతూ నాలుగు నెలల్లో మీ సమస్యల పరిష్కారానికి తొలి అడుగు పడుతుందని వారు హామీ ఇచ్చారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో తీర్చేందుకు తొలి సంతకం పరిటాల సునీత దేనిని వారు తెలిపారు. ధర్మవరం కు ఒక మేనిఫెస్టో ఉండాలి అన్న ఉద్దేశంతోనే ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు తాను పాదయాత్రకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. తదుపరి ముఖ్య నాయకులతో కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపడం జరిగిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధినేతకు ధర్మవరం సమస్యలన్నీ కూడా వారి దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రతిరోజు గుడ్ మార్నింగ్ అంటూ షో పుట్ అప్ మాత్రమే చేస్తున్నారని ప్రజా సమస్యలను నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎప్పుడో వాటిని పరిష్కరించే వారిని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్ కుమార్,కమతం కాటమయ్య తోపాటు నాగురు హుస్సేన్, పురుషోత్తం రెడ్డి, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు, ఔటసోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-బ్యూరో శ్రీ సత్యసాయి: మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు.కదిరి పట్టణంలో 2వ రోజు కొనసాగుతున్న మున్సిపల్ కార్మికులు సమ్మెకు శనివారం సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో,మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, సురేంద్ర, ఆంజనేయులు,మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని లేనిపక్షంలో కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా డివిజన్ కార్యాలయాల్లోనే మస్టర్ వెయ్యాలని, పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవులు ఎం కాస్మెంటు ,పెండింగ్ డీఏలు, ఇంక్రిమెంట్లు కార్మికుల ఖాతాల్లో వేయాలని, ప్రభుత్వ సెలవులు మంజూరు,చేయాలని, గ్రాట్యూటి చెల్లించాలని,ఇంజనీరింగ్ వర్కర్స్‌కి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అన్ని రకాల కార్మికులకి, పీఎఫ్, ఈఎస్ఐ లు ఇవ్వాలని పలు సమస్యలు పరిష్కరించాలని, పారిశుద్ధ్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లు, పార్క్ వర్కర్లు, ఇంజనీరింగ్ విభాగ సిబ్బందికి, స్కూల్ స్వీపర్లకు, టాయిలెట్ వర్కర్లకు, డ్రైవర్లకు స్కిల్డ్, హైస్కిల్డ్, క్లాప్ డ్రైవర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు తదితర డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధి కార్యదర్శి మధు నాయక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేంద్ర,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు,పవన్, మరియు మున్సిపల్, యూనియన్, నాయకులు, నాగరాజు, సూరి,శ్రీనివాసులు, కృష్ణ ప్రసాద్, రాజా, శ్రీనివాసులు, గంగాదేవి, గంగాద్రి, శివమ్మ,మహేశ్వరీ, జయమ్మ,తదితరులు పాల్గొన్నారు.

- రాజకీయ చరిత్రలో ఎక్కడా పోలీసులు రాణించినట్లుగా గుర్తింపు లేదు
- ఎంత త్వరగా వెలుగులోకి వస్తారో అంతే త్వరగా కనుమరుగవుతున్నారు
- మడకశిరలో పోలీస్ మంత్రం ఫలించేనా... లేక వికటించేనా
- డాక్టర్ ను కాదంటే మడకశిరలో వైసీపీకి ముప్పు

రాజకీయాల్లో పోలీసులను ఆదరిస్తారా

విశాలాంధ్ర-మడకశిర : రాష్ట్ర రాజకీయాలలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంటే.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మడకశిరకే మరొక స్థానం దక్కుతుంది. ఎందుకంటే ఇతర నియోజకవర్గాల్లో ఉండే పరిస్థితులు ఇక్కడ ఎక్కడా కనిపించవు.... ఒకే కుటుంబానికి గాని, లేదా ఒకే వర్గానికి గాని పట్టం కట్టే సాంప్రదాయం మడకశిరలో ఇప్పటివరకు లేదు... ఇక్కడ పార్టీని చూసి ఓటేస్తారు అనే వారి కంటే అభ్యర్థుల వ్యక్తిత్వం చూసి ఓటు వేసే వారే అధికం....మడకశిరలో ఓటర్లకు బాగా పరిచయమున్న వ్యక్తులకే ఎప్పుడూ పట్టం కడతారు..నియోజకవర్గంలో పరిచయం లేని వ్యక్తులు ఎవరు పోటీ చేసినా వారికి పరాభవం ఎదురు కాక తప్పదు....దీనికి ప్రత్యక్ష సాక్ష్యంగా చూపడానికి ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కూడా ఉన్నారు.2014 ఎన్నికలలో కొత్తగా బరిలోకి దిగి ఓటమిపాలయ్యారు.... అయితే తదనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాలలోని ప్రతి ఒక్కరితోనూ పరిచయాలు ఏర్పరచుకొని రాజకీయ చతురతతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసి విజయం సాధించారు.

వైయస్సార్ పార్టీ నుండి పోటీ చేసే గెలుపొందాలంటే మడకశిరలో అంత సులభం కాదన్న విషయం అందరికీ తెలిసిందే... ఎందుకంటే ఇక్కడ రాజకీయ పితామహుడు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ మంత్రి రఘువీరారెడ్డి వున్నారు....మరోవైపు రఘువీరా రెడ్డి శిష్యుడిగా ఉంటూ అంచలంచలుగా ఎదుగుతూ వచ్చిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలుగు దేశంలో మరోవైపు ఉండడంతో ఇక్కడ పోటీ చేసే అభ్యర్థులకు కంటిమీద కులుకు లేకుండా పోతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.. మరి ఇలాంటి క్లిష్టతరమైన పరిస్థితులు ఉన్న నియోజకవర్గంలో స్థానికేతరులు విజయం సాధిస్తారనే నమ్మకం ఎవరిలోనూ లేదు... అయితే మడకశిర వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఐ శుభకుమార్ పేరు వస్తుందనే ఊహాగానాలు జోరు అందుకున్న నేపథ్యంలో విశాలాంధ్ర దినపత్రిక చేసిన సర్వేలో ఎన్నో వాస్తవ విషయాలు బయటకు వచ్చాయి.శుభకుమార్ కు టికెట్ వస్తుందన్న విషయం తెలియగానే ఎమ్మెల్యే వ్యతిరేక వర్గానికి సైతం ఈ వార్త మింగుడు పడడం లేదు.... ఇక టికెట్ ఆశించిన స్థానిక ఎస్సీ నాయకుల సైతం ఇతనికి టికెట్ ఇవ్వడం ఏంటని పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడిన ఎంతోమంది స్థానిక నాయకులను వదిలి స్థానికేతరులకు టికెట్ ఇస్తే అతని ఓటమి తధ్యమనే వాదన మంచం కింద బల్లి లాగా పాకుతోంది. ఇక పది సంవత్సరాలుగా ఒకపక్క రఘువీరారెడ్డిని మరోపక్క గుండుమల తిప్పేస్వామిని ధీటుగా ఎదుర్కొంటూ మడకశిరలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాని ఎగరేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి వర్గీయులు అయితే రాజీనామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.. దీనికి తోడు ఇండిపెండెంట్ జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేసి రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా దాదాపు 6వేల ఓట్లతో విజయం సాధించిన అనంతరాజు సైతం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పే స్వామికి టికెట్ ఇస్తేనే ఇక్కడ విజయం దక్కుతుందనే అభిప్రాయం హై కమాండ్ కు తెలిపినట్లు వినవస్తోంది.... ఇదిలా ఉండగా వ్యతిరేకవర్గం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి ఎలాంటి ప్రజాబలం లేదన్న వాదన మొన్న జరిగిన బీసీ సాధికారిక బస్సు యాత్రతో పటాపంచలయ్యింది... ఎమ్మెల్యే అసమ్మతి వర్గం ఈ కార్యక్రమం లో పాల్గొనక పోయినా జిల్లాలో ఎక్కడా రాని విధంగా మడకశిర బీసీ బస్సు యాత్రకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే తిప్పేస్వామికి బాసటగా నిలవడం ఇక్కడ గమనించవచ్చు.దీనికి తోడు నియోజకవర్గంలోని దాదాపు ఎంపీపీలు,మండల కన్వీనర్లు సింగిల్ విండో అధ్యక్షులు కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఫీల్డ్ అసిస్టెంట్ లు,డీలర్లు,వాలంటీర్లు,సోషల్ మీడియా కన్వీనర్లు సైతం సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామికి టికెట్ ఇస్తేనే పనిచేస్తామనే ధోరణి మడకశిరలో కనిపిస్తోంది.పది సంవత్సరాలుగా మాకు ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించే స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామికి కాదని ఎవరినో తెచ్చి పెడితే సహించబోమని పెదవి విరుస్తున్నారు.గతంలో మడకశిరలో సిఐగా పనిచేసిన శుభ కుమార్ మునిసిపాలిటీ రోడ్ల విస్తరణలో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల మీదే కేసులు బనాయించిన దాఖలాలు ఉన్నాయని మరి ఇలాంటి వ్యక్తికి టికెట్ ఇస్తే మున్సిపాలిటీ ఓటర్లను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వదులుకోవాల్సిందేనని హోటళ్ల దగ్గర,బస్టాండ్ ల దగ్గర ప్రజలు చర్చించుకోవడం కనిపించింది.ఇదిలా ఉండగా రాష్ట్రంలో ఇప్పటివరకు ఎక్కడ పోలీస్ అధికారులు రాజకీయంగా రాణించినట్లు దాఖలాలు లేవు. పోలీస్ అధికారులకు టికెట్లు ఇస్తే వాళ్లు ఎవరిని లెక్కచేయకుండా వారికి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారనే వాదన ప్రతి ఒక్కరిలోనే ఉంది.దీనికి ఉదాహరణగా హిందూపురం ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ని చెప్పుకోవచ్చు... ఎందుకంటే ఇక్బాల్ కో అధిష్టానం హిందూపురం అసెంబ్లీ టికెట్ ఇచ్చి ఎంత పెద్ద తప్పు చేశారో అందరికీ తెలిసిందే.. 2019 ఎలక్షన్ల అనంతరం అతను నియోజకవర్గంలో ఎంత సీనియర్ నాయకుడి నైనా వ్యతిరేకిస్తూ సొంత పార్టీ నాయకులనే ముప్పు తిప్పలు పెట్టాడు. దీంతో హిందూపురంలో విపరీతమైన వర్గ పోరు జరిగి ఎవరు పోటీ చేసిన గెలుస్తారనే నమ్మకం లేకుండా నియోజకవర్గాన్ని బలహీనపరిచారు. భవిష్యత్తులో మడకశిరలో కూడా అదే రిపీట్ అవుతుందనే భయం వైకాపా నాయకుల్లో కనిపిస్తోంది. తెలుగుదేశం మరియు కాంగ్రెస్ పార్టీల నుండి పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు (విశాలాంధ్ర దినపత్రికకు అందిన సమాచారం మేరకు) ఈరన్న,సుధాకర్‌లు ఇద్దరూ కూడా నియోజకవర్గంలో గుర్తింపు పొంది మంచి వ్యక్తులుగా,మంచి నాయకులుగా, స్థానికులుగా ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.ఇలాంటి వ్యక్తులపై పోటీ చేసి గెలుపొందడం అంటే ఆశామాషి కాదన్న విషయం అందరికీ తెలిసిందే... అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అయితేనే రఘువీరారెడ్డిని, గుండుమల తిప్పేస్వామిని ఎదుర్కొని వారు వేసే ఎత్తులకు పై ఎత్తులు వేసే సామర్థ్యం ఉందని నియోజకవర్గ ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.ఇలాంటి తరుణంలో స్థానికేతరులకు టికెట్ ఇస్తే రిస్క్ చేయడమనే అనుకోవాలి. ఇదే జరిగితే ఇటు ఎమ్మెల్యే వర్గీయులుతో పాటుగా అటు ఎమ్మెల్యే వ్యతిరేకవర్గం సైతం సైలెంట్ అయ్యే పరిస్థితులు మడకశిరలో కనిపిస్తున్నాయి.అయితే ఈ విషయం తెలుగుదేశం,మరియు కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో మాత్రం సంతోషాన్ని రెట్టింపు చేస్తుందన్న విషయం బహిర్గతమవుతోంది. స్థానికేతరులు పోటీ చేస్తే సులభంగా ఈ సీటును దక్కించుకోవచ్చనే వాదన వినిపిస్తోంది.ఈసారి అన్ని పార్టీలు ఆచితూచి అడుగులు వేస్తూ కుల సమీకరణాలు చూస్తూ పార్టీ టికెట్లు కేటాయిస్తున్నారు.

పేదల ఇళ్ల పట్టాలలో అవినీతిపై నిగ్గు తేల్చండి

విశాలాంధ్ర - బత్తలపల్లి : మండలంలో సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కుళ్లాయప్ప, మండల కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా గత నెల 29న మండల వ్యాప్తంగా ఇళ్ల పట్టాలకు అర్హులైన వారికి ఇళ్లపట్టాలి ఇవ్వాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కానీ ఇళ్ల పట్టాల విషయంలో తహసీల్దార్ అధికారపార్టీ నాయకులు చెప్పిన విధంగా చేసుకుంటూ పోవడం వల్ల అర్హులైన ఇల్లు లేని లబ్ధిదారులు నష్టపోతున్నారు. దాదాపుగా ఈ మండలంలో ఏడు నుండి ఎనిమిది వందల మంది అర్హులై ఉంటే వారి కాకుండా అనర్హులకి ఇళ్ల పట్టాలి ఇచ్చి చేతులు దులుపుకునే పద్ధతులు అవలంబించారు. నిన్నటి జరిగిన విషయం పైన తహసీల్దార్ చేసిన విధానాలపైన జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అదుపు తప్పి బోలెరో బోల్తా

విశాలాంధ్ర - లేపాక్షి : మండల పరిధిలోని చోళసముద్రం వద్ద గురువారం ఉదయం అదపు తప్పి టమోటా లోడుతో వెళుతున్న బోలెరో బోల్తాపడింది. హిందూపురం నుంచి కొడికొండ చెక్పోస్టుకు టమోటా లోడుతు వెళుతు ప్రమాదవశాత్తు బోల్తాపడడంతో టమోటా నష్టం మినహా ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. అయితే రోడ్డు సమీపంలో వున్న టీ షాపు వద్ద మనుషులు లేక పోవడంతో ఇనువ రేకులు విరిగి పోయాయి.ఈ ప్రమాదంలో ఎలాంటి సంఘటన చోటుచేసుకోక పోవడంతో అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

పెన్షన్ పెంపు...లబ్ధిదారులు సంబరాలు

విశాలాంధ్ర- ధర్మవరం : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పెన్షన్ 3 వేల రూపాయలు పెంచి, పేదల హృదయాలలో గూడుకట్టుకున్నాడని, పేదల సమస్యలను పరిష్కరించుటలో ఆయన సాటి అని 25 వ వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేశులు తెలిపారు. ఈ సందర్భంగా తన వార్డులో గల 500 మందికి పెన్షన్ పెంపు విషయంలో సచివాలయం నందు లబ్ధిదారుల నడుమ సంబరాలను జరుపుకున్నారు. తొలుత మేడాపురం వెంకటేశులు తోపాటు సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు అందరూ కలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకమును నిర్వహించారు. అనంతరం మేడాపురం వెంకటేశులు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఏ ప్రభుత్వము చేయని అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టి రాష్ట్ర ప్రజల మనలను పొందడం జరిగిందన్నారు.అనంతరం 500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ సాయి ప్రకాష్, కన్వీనర్లు , మల్లన్న, మల్లికార్జున రెడ్డి, సేక్షావలి, సచివాలయ సిబ్బంది నరేంద్ర, శిరీష, ఉమాదేవి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహో కాలబైరవాష్టమి వేడుకల

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని వరలక్ష్మి థియేటర్ వద్ద గల కాల భైరవ ఆలయంలో గురువారం మహో కాలభైరవాష్టమి వేడుకలు భక్తాదు లు,అర్చకుల నడుమ జరుపుకున్నారు. అనంతరం పూజారి ధనుంజయ ఆచారి మాట్లాడుతూ ధన,ధాన్య,వస్తు రూపేనా ప్రత్యేక పూజలను నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతర పూజాలు జరిగాయని కాలభైరవ స్వామిని రుద్ర భైరవ అలం కారం చేసిన వైనం భక్తాదులను విశేషంగా ఆకట్టుకున్నదని తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి భక్తాదులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయండి

వామపక్ష,విద్యార్థి సంఘాల డిమాండ్

విశాలాంధ్ర-మడకశిర : నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన రహదారులలో ఉన్నటువంటి కళాశాలలు, పాఠశాలల ఆవరణంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని వామపక్ష పార్టీ నాయకులు,ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు గురువారం రహదారులు, భవనాల కార్యాలయంలో డిఈ శ్రీనివాసులకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గం లోని దాదాపు అన్ని విద్య కళాశాలలు,పాఠశాలలు, రహదారులకు ఆనుకుని ఉన్నాయని దీంతో విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అధికారులకు తెలిపారు. ఈ ప్రమాదాలను నివారించాలంటే అన్ని ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు,జీబ్రా క్రాసింగ్ తో పాటుగా సిగ్నల్ బోర్డులను సైతం ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి అధికారులను కోరారు.దీని ద్వారా అతివేగంగా వచ్చే వాహనాలు కళాశాలల దగ్గర నెమ్మదిగా వెళ్లడమేకాకుండా ప్రమాదాలు సైతం నివారించబడతాయన్నారు. దీంతోపా టుగా పట్టణం నుండి గ్రామాలకు వెళ్లే దారుల్లో గతంలో నేమ్ బోర్డులు ఉండేవని రోడ్డు విస్తరణ పనులలో వీటిని తొలగించారని మళ్లీ అదే స్థానంలో కొత్త నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు.దీనికి ఆర్ అండ్ బి డి ఈ సానుకూలంగా స్పందించి తొందర్లోనే మీరు తెలిపిన డిమాండ్లను పరిష్కరిస్తామని విద్యార్థి సంఘం నాయకులకు హామీ ఇచ్చారు.సీపీఐ ఇన్చార్జ్ ఆర్ జి పవిత్ర,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర రెడ్డి,పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు ఉమేష్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ పాల్గొన్నారు.

జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించి వెంటనే అమలు చేయాలని సిఐటియు ప్రధాన కార్యదర్శి ఆయుబ్ ఖాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పదవ రోజు నిరవధిక సమ్మెలో కార్మికులు వినూత్న రీతిలో కార్మికులు ఆకులను కట్టుకొని, గడ్డిమేస్తూ తమ నిరసనను తెలియజేశారు.అనంతరం అయూబ్ ఖాన్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు మేకల బాబు, ప్రసాద్, వెంకటేష్ మాట్లాడుతూ తాము ఇన్ని రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణం అన్నారు.ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను మాత్రమే నిలబెట్టుకోమని తాము అడుగుతున్నామని వారు గుర్తు చేశా మన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనము లాంటి అత్యవసరమైన సమస్యలను తీర్చాల్సిన బాధ్యత నేడు రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కార్మికుల ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తే తాము పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు దుర్గమ్మ, నర్సక్క, నారాయణస్వామి, మారుతి, ముకుంద, అద్ర మహేష్, నాగరాజు, అనీలు, రామాంజనేయులు, పరమేష్ పాల్గొన్నారు.

అరెస్టులతో మా ఉద్యమాలను ఆపలేరు..

అంగన్వాడి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గత కొన్ని రోజులుగా తాము న్యాయబద్ధంగా చట్టపరంగా చేస్తూ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులు చేసి భయాందోళనకు గురి చేయడం సరైన పద్ధతి కాదని, ఇటువంటి వాటికి భయపడేది లేదని అంగన్వాడి కార్మిక సంఘం నాయకురాలు సరస్వతి, చంద్రకళ, సా లక్కా, మంచాలనీ దేవి, వీణ, గోవిందమ్మలు తెలిపారు.ఈ సందర్భంగా గురువారం మోకాలు మీద నిలబడి తమ నిరసనను తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చుటలో తాము కీలకపాత్ర వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టినట్టు వ్యవహరిస్తే తమ పోరాటాలను ఉధృతం చేసి సమస్యల పరిష్కార దిశలో తాము ముందడుగు వేస్తామని తెలిపారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-ధర్మవరం: పేదల పాలిట ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, 33వ వార్డ్ ఇంచార్జ్ బడన్నపల్లి కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయంలో ప్రభుత్వం పెన్షన్ దారులకు పెంపు విషయముపై (3000 రూపాయలు) సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, లబ్ధిదారుల ద్వారా సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం భాగ్యలక్ష్మి, కేశవరెడ్డి చేతుల మీదుగా దాదాపు 370 మందికి పెంచిన పెన్షన్ లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వము చేయని అభివృద్ధి పనులను నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టడం పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని,ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడుపుటలో వారి కృషి అనన్యమైనదని తెలిపారు.తదుపరి 500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని కూడా చేపట్టారు.ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ బూత్ కన్వీనర్ల కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-గుడిబండ: మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఆధ్వర్యంలో ఐదు మండలాలకు చెందిన మండలాల కాంగ్రెస్ కన్వీనర్‌లు గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి గ్రామస్థాయి బూత్ కన్వీనర్లను నియమించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అభివృద్ధి కోసం బూత్ కన్వీనర్లు పాటుపడాలని, దేశానికి భావి ప్రధాని రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగలవాయి పాళ్యం ప్రభాకర్ రెడ్డి, ఐదు మండలాల కన్వీనర్లు,నాయకులు పాల్గొన్నారు.

12న సామాజిక తనిఖీ ప్రజా వేదిక

విశాలాంధ్ర - అగళి : మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు మండలం లో జరిగిన 443 ఉపాధి హామీ పనులపై 6.70 కోట్లు వ్యయానికి సంబంధించి డిశంబర్ 29 నుండి ఈ నెల 11 వరకు నిర్వహించిన 17వ విడత సామాజిక తనిఖీ లో అధ్యయనం చేసిన వివరాలను ఈ నెల 12న స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమంలో చదివి వినిపిస్తున్నట్లు ఎంపీడీఓ రవిప్రసాద్ ఏపీఓ శివన్న తెలిపారు. ఈ ప్రజా వేదిక కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూలీలు పాల్గొనాలన్నారు.

రోగులకు సేవ చేయటయే తృప్తి

విశాలాంధ్ర - ధర్మవరం : రోగులకు సేవ చేయడంలోనే తృప్తి ఉందని శ్రీ సత్య సాయి భజన మండలి నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దాదాపు 20 మందికి పాలు బ్రెడ్లు బిస్కెట్లను వారు పంపిణీ చేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమం దాతల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని, దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు కూడా తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ నజీర్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి భజన మండలి వారు చేస్తున్న ఇటువంటి కార్యక్రమాలు ఎంతో మందికి స్ఫూర్తినిస్తాయని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇటువంటి కార్యక్రమాలు వరంలాగా మారాయని తెలిపారు.అనంతరం డాక్టర్ నజీర్ తో పాటు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది భజన మండలి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రైలు ప్రయాణికులకు అల్పాహారం పంపిణీ... దేశంలో నుండి పుట్టపర్తి సాయి బాబాను దర్శించుకునేందుకు రాష్ట్రాల నుండి బాబా భక్తుడు ధర్మ అవడానికి చేరుకుంటున్నారు.400 మంది బాబా భక్తులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు.అనంతరం రైల్వే స్టేషన్ మాస్టర్ నరసింహనాయుడు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు పట్ల వారు రైల్వేశాఖ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.రిటైర్డ్ ఎస్బిఐఉద్యోగి మురళితోపాటు భజనమండలి వారు పాల్గొన్నారు.

జిల్లా టెలికాం అడ్వైజర్ బోర్డ్ కమిటీ మెంబర్ దొడ్డరంగే గౌడ్ నియామకం

విశాలాంధ్ర - అగళి : జిల్లా టెలికాం అడ్వైజర్ బోర్డ్ కమిటీ మెంబర్ గా అగళి మండలానికి చెందిన సీనియర్ భారతీయ జనతా పార్టీ నాయకులు దొడ్డరంగేగౌడ్ ను నియమించారు. మడకశిర టెలికాం ఆఫీసులో జే టి ఓ సంపత్ కుమార్ చేతుల మీదుగా జిల్లా టెలికా అడ్వైస్ బోర్డ్ కమిటీ మెంబర్గా నియామక పత్రాన్ని అందుకొన్నారు. దొడ్డరంగే గౌడ్ ఇదివరకు జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు గా పని చేస్తున్నారు. నన్ను జిల్లా అడ్వైజర్ బోర్డు కమిటీ మెంబెర్ నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరికి రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు శేఖర్ కి, కిసాన్ మోర్చా జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ కి పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి పిడి పార్థసారథి, మడకశిర నియోజకవర్గంలోని పార్టీ నాయకులకు, సీనియర్లకు అయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడపడమే ముఖ్యమంత్రి లక్ష్యం

విశాలాంధ్ర - ధర్మవరం : రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడవడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యొక్క లక్ష్యము అని మున్సిపల్ చైర్పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా 35వ వార్డు బాలాజీ నగర్ లో పల్లెకు పోదాం అనే కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వము డిబిటి/ నాన్ డిబిటి ద్వారా సంక్షేమ పథకాలకు అందజేసిన డిస్ప్లే బోర్డును(రూ.27.20 కోట్లు)వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఏ ప్రభుత్వము చేయని పనులను నాడు ముఖ్యమంత్రి చేయడం పట్ల రాష్ట్ర ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ధర్మవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్నారని, ఎన్నో సంక్షేమ పథకాలను అన్ని వర్గాల వారికి పంపిణీ చేయడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, కౌన్సిలర్ చింతా మారుతి ప్రసాద్, సచివాలయ కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, కౌన్సిలర్ చింతా పెద్ద ఎల్లయ్య, కేత లోకేష్ తో పాటు మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.

ఘనంగా అనఘాష్టమి వ్రతం

విశాలాంధ్ర - ధర్మవరం : పట్టణంలోని కొత్తపేటలో గల లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం అర్చకులు సుఖానంద, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా 108 మంది దంపతులచే అనఘాష్టమి వ్రతమును ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మూలవిరాట్ విగ్రహాలకు పాలాభిషేకం, పంచామృతాభిషేకం, వివిధ పూలతో ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు ఈ వ్రతం కు దంపతులు పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి కొత్తపేటలోని సాయిబాబా దేవాలయంలో కూడా అనగా శమీ వ్రతం వేడుకలు జరిగాయి. దాదాపు 80 మంది దంపతులు పాల్గొని తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మేటికల కుల్లాయప్ప, దత్త శివ, సంజీవులు, రామాంజనేయులు, ఊక నాగరాజు, నాగేంద్ర తదితర భక్తాదులు పాల్గొన్నారు.

ప్రమాద సమస్యకు శాశ్వత పరిష్కారం

మంత్రి పెదిరెడ్డి ఆదేశాలతో 11 కేవి విద్యుత్ లైన్ మార్పు..

మధుమతిరెడ్డిని అభినందించిన స్థానికులు

విశాలాంధ్ర - లేపాక్షి : స్థానికుల వినతితో ప్రత్యేక దృష్టి పెట్టి గత 50 ఏళ్లగా పరిష్కారం కాని సమస్య రాష్ట్ర మంత్రి పెదిరెడ్డి రామచంద్రరెడ్డి ఆదేశాలతో శాశ్వత పరిష్కారం అయింది. హిందూపురం నుండి లేపాక్షి మీదుగా "చిలమత్తూరుకు వెళ్లే 11 కేవి విద్యుత్ లైన్ పాత లేపాక్షిలో వున్న సుమారు 250 ఇళ్లు పైన వెళ్లడంతో ప్రమాదవ శాత్తు ప్రాణాలు పోవడమే కాకుండా ఎంతోమంది గాయాలు పాలై భయభ్రాంతులకు గురి అయ్యేవారు. ఎన్నో సంవత్సరాలుగా నాయకులకు, అధికారులకు విన్నవించిన సమస్య పరిష్కారం కాలేక పోయింది. అయితే విద్యుత్ లైన్ ఇళ్ల మీద పోవడంతో ఇప్పటి వరకు ఇద్దరి ప్రాణాలు పోగా మరో ఐదారుమంది గాయాలు పాలైయ్యారు. ఇటీవల లేపాక్షి ఆలయాన్ని సందర్శించడానికి విచ్చేసిన వైఎస్సార్సీపీ నాయకురాలు చౌళూరు మదుమతిరెడ్డి దృష్టికి స్థానిక వైస్ ఎంపిపి అంజినరెడ్డి, మైనార్టీ నాయకుడు నిస్సార్అహమ్మద్ పాటు స్థానిక నాయకులు తీసికెళ్లారు.దీంతో ఆమె స్పందించి, పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి దృష్టికి తీసికెళ్లి ఈ సమస్యను పరిష్కరించాలని లేని మరి కొంతమంది ప్రాణాలు పోయే ప్రమాదం వుందని మంత్రికి వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి రాష్ట్ర అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసికెళ్లి సుమారు రూ.15 లక్షలు అంచనాతో కేవి లైన్ మార్పుకు ఆదేశాలు జారీ చేసారు. ఇందులో భాగంగానే గురువారం లేపాక్షి సబ్ స్టేషన్ నుండి పిల్లిగుండ్లు కాలనీ వరకు జాతీయ రహదారి పక్కనుంచి కేవి లైన్ పనులు వేగంతంగా జరుగుతున్నాయి. దీంతో విద్యుత్ 'ప్రమాదాలతో బాదపడుతున్న స్థానిక ప్రజలు సమస్య పరిష్కారం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 05,జనవరి 2024

విద్యతోపాటు క్రీడ ల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి

రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న

విశాలాంధ్ర-పెనుకొండ: నేటి యువత విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని క్రీడలు యువజన సర్వీసులు,రోడ్లు భవనాల శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ పిఎస్ ఐఏఎస్ తెలిపారు. గురువారం మధ్యాహ్నాం పెనుకొండలోని పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ,జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్,కలిసి ప్రిన్సిపాల్ సెక్రెటరీ పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో పరిచయం చేసుకొని క్రీడల నిర్వహణ నియమ నిబంధనలు క్రీడాకారులు తెలుసుకోవాలని సూచించారు. ఏపి సచివాలయ తరపున ఆడుతున్న విష యాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడల్లో యువతీ ,యువకులు ఉత్సాహంగా పాల్గొని క్రీడా ఆసక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రపంచ స్థాయిలో ప్రస్తుత క్రీడాకారులు క్రీడల్లో ఎదగాలని ఆకాంక్షించారు.మండల స్థాయి నుంచి ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొడం జరుగుతుందన్నారు. అందువల్ల ప్రతి క్రీడాకారులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అందున విభిన్న ప్రతిభా నైపుణ్యాలతో రాష్ట్రానికి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని, దీనికై ఈ క్రీడల్లో క్రీడాకారులు తమ ప్రతిభ పతవాలను ప్రదర్శించాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రెటరీ కలెక్టరు ఒక జట్టుగా,మరొక జట్టుగా జాయింట్ కలెక్టర్ సబ్ కలెక్టర్ లు కాసేపు షటిల్ ఆడి క్రీడాకారులను విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఆతర్వాత పెనుకొండ కొండపై ఉన్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొండపై నిర్మించిన రోడ్డు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచి పనులు చాలా బాగున్నాయని, సుమారు రూ. 1350 లక్షలతో ఆరు కిలోమీటర్ల మేరకు నాణ్యత కలిగిన రోడ్డు నిర్మించినందుకు సంబంధిత శాఖ ఇంజనీర్లను ప్రిన్సిపల్ సెక్రెటరీ అభినందించారు.ఆ తర్వాత పక్కనే ఉన్న కోనేరును పరిశీలించారు. ఇస్కాన్ ప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం ట్రాన్స్పోర్ట్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి శాఖా పరమైన పనితీరు గురించి ఆర్టీవో కరుణ సాగర్, ద్వారా అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆన్లైన్ పర్మిట్ల ప్రక్రియను నేరుగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఆర్ అండ్ సంజీవయ్య, డి ఈ నాగరాజు ఏఈ వెంకటేష్, తాహసిల్దార్ సురేష్, కమిషనర్ వంశి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ లోకి చేరడం పట్ల ఆనందం

విశాలాంధ్ర-హిందూపురం : దివంగత ప్రియతమ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తనయ షర్మిల గురువారం కాంగ్రెస్ పార్టీ లోకి చేరడం పట్ల అమానుల్లా, పిసిసి జనరల్ సెక్రెటరీ బాలాజీ మనోహర్ తోపాటు కాంగ్రెస్ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. జగన్ మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మీద అభాండాలు మోపి తన చీకటి వ్యాపారాలు చేయడా నికి మోడీ తో చేతులు కలిపి, దేశాన్ని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాడని, నిజాలు తెలుసుకున్న షర్మిల దేశంలో అతి పెద్ద లౌకిక వాద ప్రజాస్వామ్య పార్టీలోకి చేరడం సుభపరినామమని, పార్టీకి దూరంగా ఉన్న నాయకులు మేదావులు ప్రజాస్వామ్య వాదులు అందరూ పార్టీలోకి రావాలని ఆహ్వానం పలికారు.వైఎస్సార్ విగ్రహానికి, ఇందిరా గాంధీ విగ్రహనికి పూలమాల వేసి బాణాసంచా పేల్చి స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో వైఎస్సార్ గారి ఆశలు ఆశయాలు కొనసాగించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు పోతామని అన్నారు. రాహుల్ గాంధీని 2024 లో ప్రధాని చేయడమే ధ్యేయంగా పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో, టౌన్ ప్రెసిడెం ట్ జమీల్, మైనారిటీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ ఫయా జ్, డీసీసీ ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషా, డీసీసీ సెక్రటరీ ఇలియాస్, హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ ఆసీఫ్, ఆర్టీఐ అధ్యక్షులు సుహెబ్ ఖాన్, అయాజ్, రామాన్జినేయులు, గంగాధరప్ప, సంజీవప్ప, ఎస్ సి సెల్ ప్రెసిడెంట్ పెరి స్వామి, నాగరాజు మూర్తి, రవితోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ కార్మికులు అరెస్టు

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలో పాత మున్సిపల్ ఆఫీస్ వద్ద దాదాపు పది రోజుల నుండి మున్సిపల్ కార్మికులు వారి సమస్యలపై నిరవధిక సమ్మె చేస్తున్నారు. దీంతో పట్టణంలో పలు కాలనీలలో చెత్తా చెదారం పేరుకుపోయింది. కాలనీలలో చెత్తాచెదారం ఎక్కువగా ఉంది. దీనివల్ల తాము అనారోగ్య పాలయ్యే అవకాశం ఉందని ప్రజలు ఎమ్మెల్యేకి మొరపెట్టు కున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పందించి తన అనుచరుల, ప్రైవేటు వ్యక్తులతో చెత్తను ఎత్తివేస్తుండగా పది రోజుల నుండి నిరవధిక సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు అడ్డగించారు. దీంతో మున్సిపల్ కార్మికులను పోలీసులు అరెస్టు చేసి విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది రామాంజనేయులు, గోపాల్, యాసీన్ పారిశుధ్య కార్మికులు వన్నూరప్ప, శంకర్, రాముడు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రిజిస్టర్ కార్యాలయం తనిఖీ

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ రిజిస్టర్ కార్యాలయాన్ని గురువారం జిల్లా రిజిస్టర్ అధికారి పివిఎస్ బాబు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఆన్లైన్ విధానంలో రిజిస్టర్ కార్యక్రమం పారదర్శకంగా జరుగుతోందని ఎక్కడ మధ్య దళారీలు ప్రమేయం లేకుండా ఎలాంటి అక్రమాలు, అవినీతి లేకుండా రిజిస్టర్లు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. 2023 -24 సంవత్సరానికి గాను రిజిస్టర్లు ద్వారా 394 కోట్ల రూపాయలు రాబడిని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని అందులో భాగంగా ఉరవకొండ రిజిస్టర్ కార్యాలయం నుంచి కూడా 14 కోట్ల రూపాయలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రిజిస్టర్ అధికారి కె. శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

విశాలాంధ్ర-ఉరవకొండ :శాసనమండలి సభ్యుడు వై. శివరామిరెడ్డి సతీమణి దివంగత ఉమాదేవమ్మ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో గురువారం ఉరవకొండ పట్టణంలోని శిరిడీ సాయిబాబా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాలికి గోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నరేష్ రెడ్డి, చంద్రశేఖర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్ ఫర్టిలైజర్ లిమిటెడ్ కంపెనీ తనిఖీ

విశాలాంధ్ర-శింగనమల: మండల పరిధిలోని లోలూరు క్రాస్‌లో ఉన్న భాస్కర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ కంపెనీని అనంతపురం సహాయ వ్యవసాయ సంచాలకులు రెగులర్ ఎం.రవి బుధవారం తనిఖీ చేశారు. ఎరువుల తయారీ, మార్కెటింగ్ లైసెన్సు లను, స్టాక్ రిజిస్టర్ లను,ఇతర రికార్డుల ను,గోడౌన్ ని తనిఖీ చేశారు, లాబరేటరీ ని పరిశీలించారు, తయారు చేసే ప్రతి ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియచేయాలని ఆదేశించారు, ఎస్ ఎస్ పి 51.25 టన్నులు, 22-0-11 ఎరువు 93 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు ఎరువుల తయారీ కేంద్ర మేనేజర్ శ్రీకాంత్ తనిఖీ అధికారులకు తెలియచేశారు.మండల వ్యవసాయఅధికారి ఎన్.అన్వేష్ కుమార్ పాల్గొన్నారు.

కంది పంటలో క్షేత్ర దినోత్సవం

విశాలాంధ్ర-యాడికి: యాడికి మండల పరిధి లోని పుప్పాల గ్రామంలో గుత్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట్రాముడు అధ్యక్షతన జాతీ య ఆహార భద్రత మిషన్ వారిచే కంది పంటలో క్షేత్ర దినోత్సవాన్ని గురువా రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కంది పంట ఆశించదగ్గ దిగుబడు రాలేదని చర్చించారు. అనంతరం వెంకటరాముడు,మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ కు రైతులకు కావలసిన నూతన రకాల విత్తనాలను సరఫరా చేస్తామని,రైతు సోదరులు అధిక దిగుబడి ఇచ్చే రకాలను సాగు చేయాలని వర్షాధారం కింద కొర్రలు జొన్నలు సాగు చేసుకోవాలని, అన్ని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతామని, రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకొని ఈకేవైసీ చేసుకుంటేనే పంట బీమా పెట్టుబడి రాయితీ, రైతు భరోసా వస్తాయని తెలియజేశారు. అనంతరం పుప్పాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పుప్పాల గ్రామ వ్యవసాయ అధికారి త్రిపుర మరియు రమేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బీసీ సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని బిజెపి కార్యాలయం వద్ద గురువారము రాయల సీమ జోన్ ఇంచార్జ్ ఓబిసి మోర్చా వై.రామాంజనేయులు ఆధ్వర్యంలో బిసి సభను విజయవంతం చేయాలని వాల్ పోస్టర్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పాదయాత్రలో బీసీలకు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కారు. 56 బిసి కుల కార్పొరేషన్లకు నిధులు లేవు. కార్పోరేషన్ చైర్మన్ డైరెక్టర్లకు నిధులివ్వకుండా అవమానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 37 శాతం ఉన్న రిజర్వేషన్ని 22 శాతానికి తగ్గించారు. కావున బిజెపి ఓ బి సి నాయకులు కార్యకర్తలు ఈనెల 7వ తేదీ జరిగే బీసీ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు నాగరాజు, బిజెపి నాయకులు కర్నూలు జిల్లా ఇన్చార్జి జంగం రెడ్డి, అంకాల్ రెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శివ, సంజీవ పాల్గొన్నారు.

బాబు భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర - పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే ఆయన ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ లోని సంక్షేమ పథకాల ద్వారా ఏపీలోని ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.1,22,000ల ప్రయోజనాలు అందుతాయని ఇది ఇంటింటికీ బాబు ఇచ్చే గ్యారెంటీ అని ఇంటింటా తిరుగుతూ తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవర్ధన్ రాజు, సుదర్శన్ నాయుడు, నాగేష్, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ ఎక్కడ జగన్ ...?

విశాలాంధ్ర-ఉరవకొండ: జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటూ గురువారం ఉరవకొండలో తెలుగుదేశం పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం (టీఎన్ఎస్ఎఫ్,) మరియు తెలుగు యువత ఆధ్వర్యంలో పట్టణంలో వినూత్న నిరసన కార్యక్రమాలను చేపట్టారు. స్థానిక టిడిపి కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. భిక్షాటన చేసుకుంటూ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థి,యువజన నిరుద్యోగ నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నప్పటికీ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో వైఫల్యం చెందారని ఆరోపించారు. తాను అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని ఇచ్చిన హామీని అమలు చేయకుండా నిరుద్యోగులను నిలువునా మోసం చేశాడని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు ప్యారం భరత్, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి కుమార్ స్వామి, తెలుగు యువత నాయకులు మనీ చౌదరి, వన్నూరు స్వామి,పెద్దన్న, విజయ్ చంద్ర విద్యార్థి, యువజన, నిరుద్యోగులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ కలను సాకారం చేయడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలి

విశాలాంధ్ర-ఉరవకొండ : వికసిత్ భారత్ కలను సాకారం చేయడంలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ సురేష్ బాబు అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో పాలిటెక్నిక్ కళాశాల కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారి సి.నాగరాణి ఆదేశాలతో వికసిత్ భారత్ పై అవగాహన మరియు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ సృజనాత్మకత, సాంకేతికతతో నైపుణ్యంగా సమర్థతతో పని చేసినప్పుడే స్థిరమైన అభివృద్ధి చెంది భారతదేశ ఏ2047 సంవత్సరానికి ప్రపంచంలో అగ్ర దేశంగా నిలుస్తుందని తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకురాలు సులోచన విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో అనేక మంది విద్యార్థులు దేశంలో స్థిరమైన అభివృద్ధికి సంబంధించి అనేక సలహాలు సూచనలు ఇవ్వడం పట్ల కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం చంద్రంబాబు, మోసెస్ రవీంద్ర, పి అనిల్, సాయి సందీప్, అలీ హాఫ్ హసేన్, ధనలక్ష్మి వీరితోపాటు అనేకమంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్ర దిగ్విజయం చేయండి

విశాలాంధ్ర-ఉరవకొండ : పట్టణంలో ఈనెల ఏడో తేదీ నియోజకవర్గ ఇన్చార్జి వై విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబోయే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని వైసిపి బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సిపి వీరన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రం విడపనకల్లులో గురువారం ఆయన పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, గుమ్మనూరు జయరాం, విడుదల రజిని, సినీ నటుడు, ప్రింట్ మీడియా సలహాదారుడు అలీ, ఎంపీలు నందిగామ సురేష్, తలారి రంగయ్య, మాజీ ఎంపి బుట్టా రేణుక పాల్గొంటారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని మండలని ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు కృషి చేయాలన్నారు. ఉరవకొండలో మధ్యాహ్నం 3గంటలకి భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగునని, ఈ కార్యక్రమానికి విడపనకల్ మండల వ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తహసిల్దార్ రాజకుమార్‌కి సన్మానం

విశాలాంధ్ర - యాడికి : యాడికి మండల తహసీల్దారుగా నియమితులైన రాజకుమార్ ని లియో క్లబ్ ఆఫ్ యాడికి సభ్యులు గురువారం శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.అనంతరం సభ్యులు మాట్లాడుతూ తాహసిల్దార్ రాజ్ కుమార్ భవిష్యత్తులో ఉన్నతమైన పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లియో క్లబ్ సభ్యులు విశ్వనాథ్, తిరు, కుమారస్వామి, శివ, నారాయణస్వామి, గోపి, కృపాకర్ పాల్గొన్నారు.

40 సంవత్సరాల వ్యక్తికి పింఛన్ ఎలా మంజూరు చేస్తారు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన గిద్దలూరు బ్రహ్మయ్య తండ్రి పేరు గిద్దలూరు వెంకటసుబ్బయ్య అనే వ్యక్తికి 40 సంవత్సరాలు వయసు ఉందని అతనికి ఏ నిబంధనలు ప్రకారం చేనేత పింఛన్ ని ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర ఎంబీసీ సాధికారక సభ్యులు బి. గోపాల్, బెస్త హరి, ఉరవకొండ ఎంపీడీవో అమృత రాజును గురువారం స్థానిక కార్యాలయంలో కలిసి అభ్యంతరం తెలిపారు. స్కూల్లో చదివిన రికార్డుల ప్రకారం 1983లో ఆ వ్యక్తి జన్మించాడని తక్కువ వయసు ఉన్న వారిని ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు పింఛన్ ఐడి నెంబర్ 11200196718 దీనిపై సమగ్రంగా విచారణ జరిపి మంజూరైన పింఛన్‌ని రద్దు చేయాలని పేర్కొన్నారు.

ఉత్సాహభరితంగా పెంచిన పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ కార్యాలయం నందు గురువారం రాష్ట్ర ప్రభుత్వము వృద్ధులకు వికలాంగులకు పెంచిన పెన్షన్లను పంపిణీ చేయడానికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండలాధ్యక్షులు గీత రామ్మోహన్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫరూక్ ఖాన్, కౌన్సిలర్లు పాల్గొని లబ్ధిదారుల గురించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చిన ప్రకారం 3000 రూపాయల పింఛన్లను పెంచుకుంటూ వచ్చారని, కావున జగన్మోహన్ రెడ్డిని మరల రాబోయే ఎన్నికలలో దీవించాలని కోరారు. పెన్షన్లు పంపిణీలో కూడా వాలంటీర్లు ప్రతినెల 1వ తేదీన లబ్ధిదారుల ఇంటి దగ్గరికి వచ్చి పింఛన్లు ఇస్తున్నారని, అలాగే మంజూరు విషయంలో కూడా పారదర్శకంగా వ్యవహరిస్తున్నారని, కావున సచివాలయ వ్యవస్థ ద్వారా జగన్మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని, మాట తప్పని మడమ తిప్పని నాయకుడుని ఆయనను దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శివశంకరప్ప, కమిషనర్ వంశీకృష్ణ, భార్గవ, వైస్ చైర్మన్ సునీల్, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ఎన్‌పికుంట : కదిరి పట్టణంలోని నిజాం కాలనీ 15వ వార్డులో నివాసముంటున్న పి. జాబీర్ ఖాన్ దంపతుల కుమార్తె వివాహానికి గురువారం రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్ బాబ్జాన్ రూ.10 వేలను విరాళంగా అందించారు. పి.జాబీర్ ఖాన్, జరీనా కుటుంబ సభ్యులు విరాళం అందజేసిన బిజెపి నాయకులు బాబ్జానుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.వివాహానికి ఆర్థిక సాయం అందించిన బిజెపి రాష్ట్ర మైనార్టీ మోర్చా నెంబర్ షేక్ బాబ్జాన్ కు మండల ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

రైతు సంఘాల తోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - నల్లమాడ : రైతు సంఘాల తోనే అభివృద్ధి సాధించ వచ్చు నని ఏపీఓ ఏపీఎం చిన్న వెంకటప్ప పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని అగ్రికల్చర్ కార్యాలయంలో అగ్రికల్చర్ కార్యాలయంలో 7వ వార్షికోత్సవ మహాసభ అగ్రికల్చర్ కార్యాలయంలో అధ్యక్షులు జయ మ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్ పీజి పనితిరు రుణాల రికవరీ, రైతుల పంటల మార్కెటింగ్ గురించి మాట్లాడం జరిగింది.అనంతరం రెండు సంవత్సరాల పూర్తిగా విధుల్లో పాల్గొని పదవీ విరమణ పొందిన కోశాధికారి గంగులయ్యకు పూలమాళలు, దుశ్యాలవాలతో ఘణంగా సన్మానించారు. సమావేశం లో కార్యదర్శి రామప్ప, సీసీ ఈశ్వరయ్య ఏపీఎం లైవ్ స్టాక్ పద్మావతమ్మ, రైతు మిత్రలు జయచంద్ర, కేశవ, కుళ్లాయప్ప అకౌంటెంట్స్ ఓబులమ్మ, శిరీష, ఎఫీఓ బీటీడీలు,లు, ఎఫ్ పీజి సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయి బ్రెయిలీ జయంతి



విశాలాంధ్ర - పెనుకొండ : అంధులకు ప్రత్యేక లిపిని కనుగొని, అంధుల జీవితాల్లో వెలుగు నింపిన "లూయి బ్రెయిలీ" జయంతిని గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన లూయి బ్రెయిలీ జయంతి కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జెవివిఎన్ కేశవరావు పాల్గొని ప్రసంగించారు. చూపులేని ఎంతో మంది అందు లకు లిపిని కనుగొనడం ద్వారా లూయి బ్రెయిలీ విద్యా ప్రదాతగా నిలిచాడ న్నారు. ఫ్రాన్స్ లో జన్మించిన లూయి బ్రెయిలీ జయంతిని ప్రతి ఏటా జనవరి 4న కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అభినందనలు తెలిపారు. జాతీయ సాహస యాత్ర విజేతలకు అభినందనలు... గత నెల 19 నుంచి 28 వరకు హిమాచల్ ప్రదేశ్ లోని హాట్ కోటిలో జరిగిన జాతీయ సాహస శిబిరంలో ఎస్కే యూనివర్సిటీ తరపున పాల్గొని విజయవంతంగా తిరిగి వచ్చిన కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుఎస్.కావ్య,ఎల్.మౌనిక లను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె వి వి ఎన్ కేశవరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కే జయప్ప, డాక్టర్ కే ఎల్ కాంతారావు,ఎస్ రంగనాయకులు ఐక్యూఎసి కోఆర్డినేటర్ డా. యశోద రాణి, అధ్యాపకులు చెన్నారెడ్డి, ప్రతాప్, హరీష్, హరి,శ్రీనివాసులు, విద్యార్థులు అభినందించారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి

విశాలాంధ్ర - అమడగూరు : లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక మండల తహసిల్దార్ కార్యాలయంలో ఎం ఆర్ ఓ వెంకటరెడ్డి అధ్యక్షతన కార్యాలయ సిబ్బంది లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ పట్టుదల కష్టానికి మెచ్చుకుని తీరాలి అని ఆయన ఒకవక్క వైకల్యాన్ని జయించి తాను అనుకున్నది సాధించి ఎందరికో ఆదర్శంగా నిలిచాడు అని అంధులకు ఆపద్బాంధవుడు లూయిస్ బ్రెయిలీ అలాంటి మహనీయుడి జయంతి మా కార్యాలయంలో జరుపుకోవడం అందులో మా సిబ్బందిలో ఒక్కడైనా అంధుడు వై.బాబు చేతుల మీదుగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని తెలియజేశారు. అనంతరం బాబు మాట్లాడుతూ అంధుల పాలిట దేవుడు లూయిస్ బ్రెయిలీ నిరుపేద చెప్పులు కుట్టే కుటుంబంలో పుట్టి బాల్య చాపల్యంలో కళ్లు పోగొట్టుకొని చిన్నప్పుడే పూర్తి అంధుడైపోయాడు. అయినా ఆత్మస్థైర్యం కోల్పోక తనలాంటి అందరూ చదువుకోవాలన్న పట్టుదలతో ప్రత్యేకమైన లిపిని తయారుచేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాడు అని శిలలపై చెక్కిన శిల్పాల అందాన్ని ఎన్ని కళ్లున్నా ఆస్వాదించడం అంత సులభం కాదునీ, ఎందుకంటే కఠినమైన శిలల్ని సైతం వెన్న ముద్దలా కరిగించి మలచగలిగిన చాతుర్యం ఆనాటి శిల్పుల సొంతం. అసలు చూపే లేనివారి పరిస్థితి ఏంటి అని అలా ఊహ కల్పనకే ఆనాడు ఆద్యం పోసిన బ్రెయిలీ లిపి నేడు అంధుల జీవితాల్లో వెలుగులు నింపిందని గుర్తు చేశారు.

జయహొ బీసీ కార్యక్రమంలో టీడీపీ అధినేతని కలిసిన సామకోటి

విశాలాంధ్ర-పుట్టపర్తి : చంద్రబాబు నాయుడును జయహొ బీసీ" ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుదుని జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ కలిశారు. గురువారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో చంద్రబాబును కలిసి కలియుగ ప్రత్యక్ష దైవం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి చిత్రపటాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆదినారా యణ మాట్లాడుతూ బలహీనవర్గాల అభ్యున్నతి,సంక్షేమం,రాజకీయ, ఆర్థిక అభివృద్ధి టీడీపీ వల్లే సాధ్యమవుతుందన్నారు. బీసీల రక్షణ కోసం ఎస్సీ,ఎస్టీ చట్టం తరహాలో ప్రత్యేక చట్టం తీసుకొస్తామని యువగలం పాదయాత్రలో నారా లోకేష్ బాబు తెలియజేశామన్నారు. జగన్ ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బీసీల శ్రేయస్సు టీడీపీతోనే సాధ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు, అక్రమ కేసులు పెరిగాయని,బీసీల రక్షణ కోసం ఎస్సీ,ఎస్టీ చట్టం తరహాలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరుతున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కేవిఎన్ పార్థసారథి, బిసి జిల్లా అధ్యక్షులు కొట్టాల శ్రీరాములు,తెలుగుదేశం పార్టీ గాండ్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులకు పౌష్టిక ఆహారం

విశాలాంధ్ర-లేపాక్షి: ఎన్నో సంవత్సరాలుగా అనుబంధాలు ఆప్యాయతలు ఉన్న సొంత ఊరిలో ఏదో ఒక సేవ చేయాలనుకోవడం అలాంటిదే ఈరోజు నెరవేరడం మా అదృష్టంగా భావిస్తున్నామని ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వైద్య పరిక్షల నిమిత్తం వచ్చిన గర్భవతులకు చోళసముద్రం గ్రామానికి చెందిన సమాజసేవకుడు కరణం రమానందన్ తండ్రి విజయరావు గురువారం అన్నదాన కార్యక్రమంను ప్రారంభించారు. రమానందన్ తల్లి రమామణి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమంను నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు. సృష్టికి జీవం పోసే గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందజేయడం తాను అదృష్టంగా బావిస్తున్నానని తెలిపారు. అదేవిధంగా ప్రతి నెల గురువారం వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణీ స్త్రీలందరికి పౌష్టికాహారం శాశ్వతంగా అందజేస్తామన్నారు. ఆయన హామి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనను లేపాక్షిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అంజినరెడ్డితో పాటు స్థానిక నాయకులు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గుడిబండ లో వికసిత్ భారత్

విశాలాంధ్ర-గుడిబండ : గుడిబండ మండల కేంద్రంలో వికసిత్భారత్ కార్యక్రమం ఎంపీడీవో రామారావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, బిజెపి అసెంబ్లీ కొ కన్వీనర్ బసవరాజు,మండల అధ్యక్షులు పలారం ఉమేష్, మడకశిర నగర అధ్యక్షులు అనిల్ కుమార్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సంతోష్ పాల్గొని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లపై అవగాహన నిర్వహించారు.అలాగే లబ్ధిదారులు ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ధన్యవాదాలు తెలుపుతూ వారి యొక్క అభిప్రాయాలను తెలియజేసారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కరుణాకర్ గౌడ్, శ్రీ విష్ణు ప్రియ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, గ్యాస్ మేనేజర్ నాగరాజు,ఈఓఆర్డి నాగరాజునాయక్, ఏపీఎం ముత్యాలప్ప,ఏపీవో భార్గవి, గ్రామ ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-పెనుకొండ: అంగనవాడి సమస్యలు పరిష్కారం కోరుతూ తమ సమస్యలను పరిష్కరించాలని గురువారంతో 24వ రోజు సమ్మెలో భాగంగా పెనుకొండ ఐసిడిస్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రమేష్ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు జయమ్మ, బావమ్మ, సెక్టార్ లీడర్లు మాబు నిషా, వరలక్ష్మి, అనిత, శ్యామల గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపుపై...ప్రజలు హర్షం వ్యక్తం

విశాలాంధ్ర - అమడగూరు : స్థానిక మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి కళ్యాణ మండపంలో గురువారం పుట్టపర్తి శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పెన్షన్ వారోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్ఆర్సిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేశాయి భారతి సుదర్శన్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిరుపేద వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు ఇచ్చిన మాట ప్రకారం మాట తప్పకుండా దశలవారీగా 3 వేలకు పెంచి మాట నిలబెట్టుకున్నారని, గతంలో తెలుగుదేశం పార్టీ కందువా వేసుకుంటేనే పెన్షన్ అందలేదని, జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందిస్తున్నారని, ప్రజలను మోసం చేసే గుణం చంద్రబాబుదని, ఆయన అధికార దాహం కోసం ఎంతకైనా దిగజారుతారన్నారు. మండలంలో అధికారుల నిర్లక్ష్యం వలన జగనన్న ఇల్లు నిర్మాణాల పనులు అక్కడక్కడ ఆగిపోయాయని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను తొలగించి లబ్ధిదారుల ఖాతాలోకి డబ్బులు జమ అయ్యేటట్లు తగు చర్యలు తీసుకుంటామని, ఈసారి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా, మీ శ్రీధర్ అన్నను ఎమ్మెల్యేగా గెలిపించుకునే బాధ్యత మనందరి పైన ఉందని, లేకుంటే రాబోవు రోజులలో మీరందరూ అనేక కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మళ్లీ మన పార్టీ అధికారంలోకి రాగానే మలక వేముల క్రాస్ నుండి అమడగూరు మీదుగా కర్ణాటక మద్దేపల్లి వరకు డబల్ రోడ్డు వేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్ పి టి సి శివ శంకర్ రెడ్డి, ఎంపీపీ గజ్జల ప్రసాద్ రెడ్డి, తాసిల్దార్ వెంకటరెడ్డి, ఎంపీడీవో మునెప్ప, మండల కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచులు షబ్బీర్ భాష, శ్రీధర్ రెడ్డి, ఆది, రంగారెడ్డి, ఎంపీటీసీ పెద్దప్పయ్య, శ్రీరాములు, బొట్టు స్వామి, జయప్ప, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, మండలు భారీగా ప్రజలు పాల్గొన్నారు.